# సుఖీ - దుఃఖీ

రచన: మునిపల్లె రాజు

జీవితమంతా శత్రురాజుల్తో యుద్ధాలొనరిస్తూ ఆ మారణహోమంలోనే ప్రాణాలొడ్డి వీరస్వర్గమలంకరించిన ఒకరాజూ—స్త్రీలోలుడై, బ్రతుకంతా అందమైన స్త్రీలను వెతికి, వెతలుపడి, కామించి, ప్రేమించి, ఆ ప్రేమవహ్నిలోనే సింహాసనాన్ని, సామ్రాజ్యాన్ని త్యజించటంతో నింపుకొని స్వర్గంచేరిన నరొక రాజూ—యింద్రసభలో కలుసుకున్నారు.

మొదటిరాజన్నాడు—"ఛీ-ఛీ-యీ ఊర్వశి నృత్యం చూసీచూసి నాకళ్ళు కాయలు కాచిపోతూన్నాయి. లేచి అలా వెళ్దాం రా-ఎక్కడైనా సాము, గరిడీ, కుస్తీపట్లు-వినోద ప్రదర్శనాలు చూపుతున్నారేమో."

తన్మయుడై—ఏకాగ్రా నందోద్రేకాలతో, ఊర్వశి పదభంగిమాలతో, నడుమువంపుల్తో, వక్షపు ఆటుపోటులతో కరిగిపోయిన విజయనాధ్‌కు బహు చికాకు వేసింది:

"నీ దగ్గర వట్టి పాతకత్తుల తుప్పు కంపు—"

వీరదేవ్ నవ్వాపుకోలేక-"నీ దగ్గర వట్టి పారిస్ సెంటు కంపు" అన్నాడు.

ఇది మొదటిరోజు సరసం!

మరుసటి సాయంత్రం నందనవనోపరి భాగాల ప్రక్కల్లో చల్లగాలి షికార్లు చేస్తున్నారు మిత్రులిద్దరూ:

"ఎందుకోయ్, ఎప్పుడూ యిలా విచారగ్రస్తుడవై వుంటావ్?" అని ప్రశ్నించాడు వీరదేవ్.

విజయనాధు చుట్టూ కలియజూశాడు. పచ్చటి తోటలూ, పిలిచే పిట్టలూ, పలికే ఆకాసమూ, ధ్యానిస్తూన్న కొండలూ—లోయలూ!

"ఎలా నవ్వగలను వీరదేవ్? విప్పి చూడు—యీ నా భారహృదయాన్ని. భూలోకంలోని నా ప్రియురాండ్రు నాకై పంపిన కన్నీటి సందేశాలు నన్ను సతతమూ కలవరపెడతాయి. ఎలుగెత్తి, ఆ లోయలు, ఆ నదులు మార్మోగే వరకూ-నా ప్రేయసులు నన్ను పిలుస్తుంటారు అహర్నిశలూ! ఎక్కడవుంది నాకు శాంతి?"

"నీవు దుఃఖివి!"

"నీకూ యిటువంటి మధురానుభవాలుంటే నా దుఃఖం నీకర్థమయ్యేది!"

వీరదేవ్ మీసాలుచాతుర్యంగా మెలివేశాడు.

"ఓయి పిచ్చివాడా! బహుశః నా యశఃకీర్తులు తెలియకపోవచ్చును-దేశాలకు దేశాలు విజయయాత్రలు సాగించాను. నా పేరు శత్రు రాజులకు సింహస్వప్నం! నా జెండాను, నా వీర పతాకాన్ని తిలకించి దాసులు కాని రాజు నాడొక్కడూ లేడు-! నేను జయించిన రాజుల కూతుళ్ళను, భార్యల్ని, అందమైన పడుచు పిల్లళ్ళను నా సేనాపతులు నాకై కానుకలు తెచ్చేవాళ్లు. ఒక్కొక్క రేయికి ఒక్కొక్కతెను అనుభవించిన నా రోజులముందు—నీ అనుభవాలొక్క లెక్కా—"

వీరదేవుడి కళ్ళు గర్వంతో మెరిశాయి.

విజయదేవుడు హృదయంలో ఏడ్చి, కళ్ళలో లోతులు చూపించాడు.

ఆరునెలల తరవాత!

"నిన్ను గుర్తించలేకపోయాను-సుమా! ఏవీ? వెనకటి మీసాలూ, రుధిరజ్యోతుల్లాంటి కళ్లూ?- కండలన్నింటినీ ఎండగట్టావు. భూలోకపు పాత కత్తులకొరకై దిగులుపడలేదు గదా!?" విజయుడన్నమాటలు. వీరదేవుడి కళ్లు కొత్త 'అర్థంతో' శూన్యంవంక చూసి, మీనమేషాలను లెక్కించాయి.

"లేదు, విజయా! నన్ను మురిపించి, మోసగించి, నా హృదిలో చిచ్చులురేపిన మేనక, ఊర్వశులు నన్ను వేన్నాడుతూన్నారు. యిది నాకు కొత్త అనుభవం! నా హృదయం బరువుగా మారింది. నాకు భవిష్యత్తుపై, ప్రేమపై నమ్మకంలేదు."

పారిజాత వృక్షంమీది చిలకలు గట్టిగా అరిచాయి. "మీ యిద్దరిలో ఎవరు సుఖి?" అని.